بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 03.03.2017 (Telugu)**

**నికాహ్ (వివాహము) కంటే ముందు అధికముగా ఇస్తిఖారహ్ చేయండి!**
**ఈ మార్గము తెలిపి నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మనపై గొప్ప ఉపకారము చేశారు. దానిని మనము ఆచరించినచో నికాహ్ తప్పక సుఃఖము నందించును. ఇన్ షా అల్లాహ్. వివాహ జీవితము సదా మనశ్శాంతి, ప్రేమానురాగముతో గడిచిపోవాలని ఎల్లప్పుడు దుఆ చేయుచుండవలెను.**

*హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 03.03.2017 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

యువతి, యువకుల వివాహ సంబంధ సమస్యలు, వివాహముల అనంతరం వైవాహిక జీవిత సమస్యలు ఈ రెండును కుటుంబాలలో ఆందోళన, వ్యాకులతకు కారణమగుచున్నవి. వివాహముల అనంతరం ఏర్పడు సంసార జీవిత సమస్యలు కేవలం భార్యా భర్తలకే పరిమితం గాకుండా ఇరుపక్షముల వారి తల్లిదండ్రులకు కూడ ఇబ్బందికరంగా మారును. ఈ సమస్య ఇంతటితోనే సద్దుమణగకపోగా ఒకవేళ వారికి సంతానము కలిగినచో సంతానములో కూడ ఆందోళన కలిగించును. కొన్ని సందర్భాలలో ఈ కారణం వలన సంతానము ధార్మిక, ప్రాపంచికంగా తప్పుదారి కూడ పట్టును. తల్లిదండ్రులకు, కుటుంబీకులకు వీటి వలన మరిన్ని ఇబ్బందులు ఎదురవును. ఒక రకంగా వరుస ఇబ్బందులు మొదలగును. ఇటువంటి సమస్యలు దాదాపు ప్రతి రోజు నాకు తపాలా ద్వారా చేరుతాయి. లేదా భేటి అయినప్పుడు ప్రజలు నాతో తమ సమస్యల గురించి విన్నవించుకొందురు. ఒక వైపు అమ్మాయిల వివాహ సంబంధముల సమస్య ఉండగా, తల్లిదండ్రులు విద్యను సాకుగా చూపి సరియైన వయసులో వివాహము జరిపించరు. వివాహ సంబంధములు ఏర్పడిన తరువాత(understanding) అనగా పరస్పరం మనసులు కలవడం లేదని వైవాహిక జీవితంలో దూరము, మనస్పర్థలు ఏర్పడుచుండును. కొందరి అమ్మాయిల విషయములో తెలుస్తున్నదేమనగా స్నేహితురాళ్లు తప్పుడు ఆలోచనలను వారి హృదయాలలో కల్పించుచున్నారు. అబ్బాయి-అమ్మాయి లేదా భార్యా భర్తల మధ్య నమ్మకము సన్నగిల్లేటట్లు లేదా అనుమానాములు, సందేహములు ఏర్పడేటట్లు తల్లిదండ్రులు స్వయముగా కొన్ని సార్లు అమ్మాయిలకు కొన్ని విషయాలు నేర్పుతారు. విచారమేమనగా పాకిస్తాన్ నుండి వివాహము చేసుకొని వచ్చిన అనగా పశ్చిమ దేశములకు వచ్చిన అమ్మాయిలు కూడ ఇక్కడి స్వాతంత్ర్యయమును చూచి ఇక్కడి వాతావరణముతో ప్రభావితమై తప్పుడు కోరికలు కోరడం మొదలు పెట్టుతారు. కొన్ని సందర్భాలలో సంసార జీవితం మొదలు పెట్టకముందే ఇక్కడికి చేరుకొని సంబంధములను విడిచిపెడతారు. ఈ పరిస్థితి అమ్మాయిలది మాత్రమే కాదు, అబ్బాయిలు కూడ ఇలాగే చేయుచున్నారు. అబ్బాయిల కంటే అమ్మాయిలలో ఈ సమస్య కొంచెం ఎక్కువగానే యున్నది. దీనికి కారణం అబ్బాయిలు, అమ్మాయిలు స్పష్టమైన సత్యముతో మాట్లాడుకోకపోవడమే. అన్ని విషయాలు ఒకరు మరొకరికి చెప్పుకోరు. కొన్ని సార్లు విద్యార్హతలు, నివాసపరంగా సమానంగా లేకున్నను అంతా సర్దుకుంటుందని తల్లిదండ్రులు బలవంతముగా అమ్మాయిల వివాహములు చేయిస్తారు

అబ్బాయిలైనను అమ్మాయిలైనను, ఒక వైపు అత్తగారైనను రెండవ వైపు అత్తగారైనను ఏ ఒక్కరిపై వంద శాతం నింద మోపరాదు. కొన్ని సందర్భాలలో అమ్మాయిల తప్పు యుండగా మరి కొన్ని సందర్భాలలో అబ్బాయిల తప్పు యుండును. నేను చెప్పినట్లు సంసార జీవిత సమస్యలు సంతానముపై ప్రభావము వేయును. తల్లిదండ్రులు

విడిపోయిన తరువాత పిల్లలు ఎవరి దగ్గర యున్నను మానసికంగా, ప్రవర్తనల పరంగా, ఇతర సామర్థ్యముల పరంగా ప్రభావితమైతారు. భార్యా భర్తల సమస్యలలో అమ్మాయి తల్లిదండ్రుల జోక్యము కూడ ఉండును. అసలు విషయములు చెప్పనందున ఫిర్యాదులు ఏర్పడుచుండును. నేనింతకు ముందు చెప్పినట్లు స్పష్టమైన సత్యముతో మాట్లాడరు. ఇదెంతో ముఖ్యమైన విషయము. ఇదే విధముగా అమ్మాయిల హృదయములలో కూడ అబ్బాయి, అతని కుటుంబీకుల గురించి కొన్ని విషయములు ఏర్పడును. ఉదా॥ అబ్బాయి తల్లి లేదా సమీప బంధువులు ఎల్లప్పుడు అమ్మాయి ముందట మా అబ్బాయి ఇంత మంచివాడని అబ్బాయిని ప్రశంసించుచుందురు, ఏదో ఒక రకంగా అమ్మాయిని తక్కువ చేసి చూపడానికి ప్రయత్నించుచుందురు. ఇదే విధముగా అమ్మాయి అబ్బాయి సంబంధములు గలవు, భార్యా భర్తల సంబంధములు గలవు. వీటిలో కూడ అబ్బాయి తరపువారు జోక్యము కల్పించుకొందురు. అబ్బాయిలు తమ వివాహ బాధ్యతలు నెరవేర్చుడం లేదని, బాధ్యత లేదని కూడ అమ్మాయిలు ఫిర్యాదుచేస్తారు. ఏది ఏమైనప్పటికి ఫిర్యాదుల ఈ పరంపర మొదలై ఇరువురి తరపున కొనసాగుచుండును.

ఈ వివిధ వయసుల సంసార జీవిత సమస్యలకు గల కారణమును ఒక్క వాక్యములో చెప్పాలంటే ధర్మము నుండి దూరము, ధార్మిక బోధనలు తెలియకపోవడం, అనాసక్తి, ప్రపంచము, ప్రాపంచిక వస్తువుల పట్ల ఆసక్తే ఇందుకు కారణం. ఈ సమస్యలకు పరిష్కారమును అన్వేషించదలచినచో ధార్మిక బోధన అధారంగా అన్వేషించవలెను ఒక వైపు మనము అహ్మదీయులమని అంటుంటాము. ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిస్తామని ప్రకటించుకుంటాము. అటులైనచో మనకు పవిత్ర ఖుర్‌ఆన్, హదీసులు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బోధనలలో లభించే ధార్మిక బోధనల ఆధారంగా దీనికి పరిష్కారము అన్వేషించవలెను. మనము ఇస్లాంను స్వీకరించాము, మనము ముస్లిములగుట మన అదృష్టము. ఎట్టి స్థితిలోనైనా ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిస్తామని మనతో ప్రతిజ్ఞ తీసుకున్న హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను మనము విశ్వసించాము. ఈ ప్రతిజ్ఞను మనము వివిధ సందర్భాలలో చేస్తూ వుంటాము. కాని దీనిని ఆచరించవలసిన సమయము వచ్చినప్పుడు మరచిపోతాము. బాహ్య రూపంలో ఎంతో మంచిగా సేవలు చేయువారు కూడ వివాహ సందర్భమున దీనిని మరచిపోతారు. వాస్తవానికి వివాహ సమయమున ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనివ్వవలెనని మనకు ప్రత్యేకంగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా ఆదేశమందినది. వివాహ సంబంధ అన్వేషణలో ప్రాధాన్యత క్రమంలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచించిన విషయమును మనము సదా గుర్తుంచుకోవలెను. దీనిని హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్‌హు ఇట్లు తెలిపిరి. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి. స్త్రీని నాలుగు కారణముల వలన వివాహమాడుతారు. ఆమె ధనము వలన, ఆమె వంశము వలన, ఆమె సౌందర్యము వలన, ఆమె ధార్మికత వలన. మీరు ధార్మికురాలిని ఎన్నుకొనుము. తద్వారా అల్లాహ్ మీకు మేలు కలిగించును. అబ్బాయి, అబ్బాయి కుటుంబీకులు ఈ విషయమును గుర్తుంచుకొన్నచో, ఇదే విధముగా అమ్మాయిలు, అమ్మాయి కుటుంబీకులు కూడ ధర్మమునకు తమ ప్రాధాన్యతనిచ్చినచో అమ్మాయి, అబ్బాయి, వారి కుటుంబీకుల గురించి తలెత్తే అనేక ఫిర్యాదులు దూరమైపోవును. ధార్మికురాలైన అమ్మాయిని అన్వేషించు, ధర్మమునకు ప్రాధాన్యతనిచ్చు అబ్బాయి తన ఆచరణను కూడ, ధార్మిక బోధన ప్రకారము చేసుకోవలసియుండును. ధార్మిక బోధనను ఆచరించే వారి గృహములో చిన్న చిన్న విషయాలలో పీడనము, అశాంతి ఏర్పడదు. అబ్బాయి కుటుంబీకులు కూడ అమ్మాయి కొరకు ఇబ్బందులను సృష్టించరు.

వివాహ సంబంధముల కంటే ముందు ఇస్తిఖారహ్ చేయాలని ఇస్లాం బోధన సూచించును. సంబంధము మేలు కలిగించవలెనని లేదా ఈ బంధుత్వములో ఏదేని చెడు యున్నచో ఇందులో ఆటంకము ఏర్పాటు చేయమని అల్లాహ్ తఆలాతో దుఆ చేయవలెను. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజి ఒక సందర్భమున ఎంతో

మంచిగా ఇట్లు తెలిపిరి. ఇటువంటి మార్గము తెలిపి నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మనపై గొప్ప ఉపకారము చేశారు. దానిని మనము ఆచరించినచో నికాహ్ తప్పక సుఃఖమునందించును. తెలిపిన మొట్టమొదటి ఉపాయము ఏమనగా నికాహ్ ఉద్ధేశము ధర్మము కావలెను. అనగా ధర్మమును అన్వేషించవలెను. సౌందర్యముపై ఆసక్తి లేదా ధనమును పొందుట లేదా గొప్ప వంశము మాత్రమే ఇందుకు కారణము కాకూడదు. మొదటగా సదుద్ధేశము కలిగియుండవలెను. నికాహ్ కంటే ముందు అధికముగా ఇస్తిఖారహ్ చేయండి! ఇందులో నాకు మనశ్శాంతి, మేలు యున్నచో ఈ సంబంధము ఏర్పడవలెనని అల్లాహ్ తఆలాతో దుఆ చేసినచో అల్లాహ్ తఆలా శుభముతో సంసార జీవితము విజయవంతముగా సాగిపోవును. వివాహము తరువాత షైతాన్ దాడులు చేయునని కూడ గుర్తుంచుకొనుము. అందుకే సంసార జీవితము మనశ్శాంతి, ప్రేమానురాగముతో గడిచిపోవాలని ఎల్లప్పుడు దుఆ చేయవలెను. ఇస్తిఖారహ్ ప్రాముఖ్యతను మరింతగా వివరించుచు హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజి ఇట్లు ఉపదేశించారు.

పెద్ద పెద్ద కార్యములలో నికాహ్ కూడ ఒక కార్యము. ఫలితము మనకు తెలియదు. కాని అల్లాహ్ తఆలాకు భవిష్యత్తు తెలుసు. కనుక మొదట మంచిగా ఇస్తిఖారహ్ చేసి అల్లాహ్ తఆలాతో సహాయము కోరుము. ఖుత్బా నికాహ్‌లో చదివే సూక్తుల ఆధారముగా వారిట్లు తెలిపిరి. దైవ భీతిని దృష్టిలో యుంచుకొని రక్త సంబంధములను పాటించుము. స్పష్టమైన సత్యము పలుకుము. మీరు మీ భవిష్యత్తు కొరకు ఏమి పంపుచున్నారో పరిశీలించుకొనుము. జీవిత విజయములను మీరు చూడదలచినచో దైవ భీతి చాలా ముఖ్యము. నికాహ్ శుభాకంక్షలు తెలిపే సందర్భమున కూడ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దుఆ నేర్పించిరి. بارك الله لك وبارك عليك وجمع بينك ما في الخير- అనగా అల్లాహ్ తఆలా మీకు శుభము కలిగించుగాక! మీరిద్దరిపై శుభమును పంపుగాక! మీరిద్దరిని పుణ్యముపై కలుపుగాక! ఈ విధముగా ప్రతి సందర్భమున మంచి, శుభముల దుఆ చేయబడును. అప్పుడే బంధుత్వములు శుభములు కలిగియుండును. కొందరు పాకిస్తాన్, భారత సమాజ ప్రభావము వలన ఇప్పటికి వంశము, జాతి సమస్యలో చిక్కుకొని యున్నారు. కాని సంబంధములు వచ్చినప్పుడు దుఆ చేయాలని అల్లాహ్ తఆలా ఆదేశించుచున్నాడు. దుఆ చేయుము, ఇస్తిఖారహ్ చేయుము, ధర్మమునకు ప్రాధాన్యతనివ్వుము. దుఆ చేసే బదులు, ధర్మమునకు ప్రాధాన్యతనిచ్చే బదులు వంశము, జాతికి ప్రాధాన్యతనిస్తారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. నికాహ్ ఎవరితో జరగవలసియున్నదో అతడు సత్కార్యుడు, మంచి ఆరోగ్యము కలిగి ఏదేని ఇబ్బంది లేక పీడనమునకు కారకుడు కాదని మాత్రమే చూడవలెను. ధర్మములో జాతికి ఎలాంటి ప్రాముఖ్యత లేదు, కేవలం నిష్టాపరత, సత్కార్యముకే ప్రాముఖ్యత గలదు. దైవభీతిని చూడవలెను. ఇదే ప్రాథమిక సూత్రము. ఇతర విషయములన్నియు దురాచారములే. సమానత్వము చూడవలెనను ఆదేశము గలదు. సమానత్వము చూడవలెను. కాని ఇందులో కూడ కఠినత్వమును పాటించకూడదు.

తమ వంశములపై కొందరికి చాలా గర్వము యుండును. ఇటువంటి ఒక వ్యక్తికి హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజి మంచి గుణపాఠం నేర్పిరి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజి వద్దకు ఒక వ్యక్తి వచ్చి నేను సయ్యద్‌ను. నా కుమార్తె వివాహము జరగుచున్నందున మీరు నాకు సహాయము చేయగలరని అనెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తన కుమార్తె ఫాతిమాకు ఇచ్చిన వరకట్న సామాగ్రి మొత్తం నేను మీ కుమార్తె వివాహానికి ఇచ్చుటకు సిద్ధమేనని వారనిరి. ఇది విని మీరు నా పరువు తీస్తారా? అని అతడనెను. నీ పరువు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కంటే గొప్పదా? అని హజ్రత్ ఖలీఫ అవ్వల్ అడిగిరి.

ఈ వరకట్న సామాగ్రి తక్కువున్నదని కూడ కొన్ని సార్లు అమ్మాయిని ఎగతాళి చేస్తారు. అమ్మాయిలను మానసికంగా వేధించేవారికి కూడ ఇందులో గుణపాఠము గలదు. ఇదే విధముగా అమ్మాయి తరపు వారు కూడ

స్థోమత ప్రకారము వరకట్నమివ్వవలెను. సామర్థ్యము మేరకే ఇవ్వవలెను. తమపై భారము వేసుకోకూడదు. బంధుత్వము కోరదలచిన అమ్మాయిని ఇస్తిఖారహ్ కంటే ముందే చూడవలెను. దీని గురించి హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశము గలదు. నేను రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద యుంటిని. వారి వద్దకు ఒక వ్యక్తి వచ్చి ఇట్లు తెలిపెను. నేను అన్సార్‌లోని ఒకమ్మాయికి వివాహ సంబంధ సందేశము పంపాను. నీవు ఆ అమ్మాయిని చూచినావా ? అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అడిగిరి. లేదని అతడనెను. అన్సార్ కనులలో ఏదో ఒక మహిమ యుండును. కనుక నీవు ముందుగా ఆమెను చూడమని అనిరి. అమ్మాయిని చూచుటలో అభ్యంతరమేమి లేదు. కాని కొందరు అబ్బాయిల కుటుంబీకులు తమ కుమారునితో కలిసి సంబంధము చూచుటకు పోతారు. అక్కడికి చేరుకొని చిత్ర విచిత్ర మాటలు మాట్లాడుతారు. గతములోనే చిత్రము చూచి, వివరములు తెలుసుకున్నను సమాధానమివ్వరు. ప్రాపంచికరీా మరో సంబంధము లభించినచో మొదటి సంబంధమును తిరస్కరిస్తారు. ఇది మంచి పద్ధతి కాదు.

వివాహ ఉద్దేశమును ధర్మము మనకిట్లు తెలిపెను. దీనిని ఆచరించినచో అమ్మాయిల మనోభావాలు గాయపడవు. అబ్బాయిల తరపున కూడ గర్వము లేదా మనోభావాలతో ఆటలాడుకునే సంఘటనలు సంభవించవు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వివాహ ఉద్దేశమునిట్లు తెలిపిరి.

పవిత్ర ఖుర్‌ఆన్ మనకిట్లు తెలిపినది. పవిత్రముగా యుండు ఉద్దేశముతో వివాహమాడుము. వివాహమైన తరువాత పుణ్య సంతానము కొరకు దుఆ చేయగలరు. అతడు తన పవిత్ర శాసనములో ఇట్లు తెలిపెను. مُحْصِنِينَ غَيْرَ مُسَافِحِينَ అనగా మీరు దైవ భీతి, పవిత్రత గల కోటలో ప్రవేశించు ఉద్దేశముతో మీరు నికాహ్ చేసుకోవలెను. వివాహము చేసుకొనని వ్యక్తి ఆధ్యాత్మిక ఆపదలలోనే కాక శారీరక ఆపదలలో కూడ చిక్కుకొనను భావము గలదు. వివాహముతో మూడు లాభములు గలవని పవిత్ర ఖుర్‌ఆన్‌తో తెలుస్తున్నది. ఇందుకే వివాహము చేసుకోవలెను. ఒకటి పవిత్రత, రెండవది ఆరోగ్య సంరక్షణ, మూడవది సంతానము. ఈ విషయములను దృష్టియందుంచుకొన్నచో వివాహ సంబంధముల సమయమున సమస్యలు ఎదురు కావు. ప్రాపంచికమును చూసే బదులు ధర్మమును చూడవలెను. అనంతరం ఈ విషయములను దృష్టియందుంచుకొని వివాహము చేసుకోవలెను.

గౌ॥ ముహమ్మద్ నవాజ్ మొమిన్ గారు జీవిత సమర్పితులు, గౌ॥ సయ్యద్ రఫీఖ్ అహ్మద్ సఫీర్ గారు సదర్ జమాఅత్ సర్‌బటన్ గార్ల ప్రత్యక్ష్య అంత్యక్రియ ప్రార్థన, హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజి మనవడు (కుమారుని కొడుకు) గౌ॥ డా॥ మిర్జా లయీఖ్ అహ్మద్ గారి, గౌ॥ అమీనుల్లాహ్ ఖాన్ సాలిక్ అమెరికా మాజీ ప్రచారకుల పరోక్ష అంత్యక్రియ ప్రార్థనలను చదివింతునని తెలిపి వారి వివరములను ఖుత్బా చివరలో హుజూరె అన్వర్ తెలిపారు.

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Hafiz Syed Rasool Niyaz, Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

.......................................................................

.......................................................................

.......................................................................